
# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | VIKARABAD

మర్పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

- కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు, అమాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్నది
- బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- మర్పల్లి ఠాణా ఎదుట శ్రేణుల ధర్నా

# అక్రమ అరెస్టులపై.. బీఆర్ఎస్ ఆందోళన

వికారాబాద్/మర్పల్లి, సెప్టెంబర్ 24 : పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరిపైనా కేసుల్లేవని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులు, అమాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. మంగళవారం ఉదయం పట్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రవీణ్, నవీన్‌లను ఓ కేసు విషయంలో మర్పల్లి పోలీసులు అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు ఠాణా ఎదుట ఆందోళన చేశారు. దళితులు, బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని మండి పడ్డారు. పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పోలీసులతో మాట్లాడేందుకు ఠాణాలోకెళ్లగా.. కాంగ్రెస్ నాయకులు అతడి ని ఎందుకు లోనికి పంపించారని ఆందోళన చేపట్టడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావ రణం ఏర్పడింది. పోలీసులు ఇరు పార్టీల వారిని సముదాయించి బయటికి పంపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ మర్పల్లి ఎస్ఐ సురేశ్ గత మూడు నెలలుగా కక్షపూరితంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉన్నదని అడ్డగో లుగా బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టించడం మంచిది కాదని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఎవ్వరికీ అధికారం శాశ్వతం కాదన్నారు. మర్పల్లిలో రోడ్డు దారుణంగా ఉన్నదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా ఇంకా రోడ్డుకు వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ ప్రసాద్‌కుమార్ మరమ్మతులు చేయించలేదని ఆరోపించారు. మర్పల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, అశోక్, రాచయ్య, మధుకర్, మిత్ర, గౌస్, గఫార్, సొసైటీ డైరెక్టర్ యాదయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్‌పర్సన్ పదవి నుంచి స్వప్న తొలగింపు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24 : పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి నుంచి చెవుల స్వప్నను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ మెజారిటీ కౌన్సిలర్లు ఉన్నతాధికారులను కలువగా.. ఈ నెల 13వ అవిశ్వాసంపై బలపరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. బలపరీక్షకు 17 మంది సభ్యులు హాజరై మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నకు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో బలపరీక్ష నెగ్గిందని ప్రకటించిన అధికారులు.. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి ప్రక్రియను కొనసాగిస్తామన్నారు. వరుస సెలవులు రావడంతో కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ కొంత ఆలస్యమైంది. అవిశ్వాస ప్రక్రియపై పూర్తి విచారణ అనంతరం ఎట్టకేలకు ఈ నెల 23న చైర్‌పర్సన్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గెజిట్‌ను విడుదల చేసింది. కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక పూర్తయ్యేవరకు వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు.



# మూగ జీవాలకూ.. మందుల్లేవ్..

- వికారాబాద్ జిల్లాలోని పశువైద్యశాలల్లో నిండుకున్న మందులు
- చిన్నపాటి మందులనూ బయటికి రాస్తున్న వైద్యులు
- 8 నెలలుగా పశువైద్య కేంద్రాలకు సరఫరా కాని మెడిసిన్
- మూగజీవాలకు అరకొర వైద్యం
- సీఎం జిల్లాలోనే ఇలాంటి దుస్థితిపై పలువురి విస్మయం

పరిగి, సెప్టెంబర్ 24 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రభుత్వ దవాఖానల పర్యవేక్షణను గాలికి వదిలిన సర్కారు.. మరోవైపు మూగజీవాలకు అవసరమైన మందులను కూ డా సక్రమంగా సరఫరా చేయడం లేదు. గత 8 నెలలుగా పశువైద్య కేంద్రాలకు మందులు సరఫరా కాకపోవడంతో.. ఏ చిన్నపాటి వ్యాధితో మూగజీవాలను వైద్యం కోసం దవాఖానకు తీసుకెళ్తే వైద్యులు మందులను బయటికే రాస్తున్నారు. ఆఖరికి బ్యాండేజీలనూ కొన్ని చోట్ల బయటి నుంచే తెప్పిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉందంటే.. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

### జిల్లాలో నెలకు 80వేలకు పైగా వైద్యం..

వికారాబాద్ జిల్లాలో సుమారు 12 లక్షలకు పైగా పశు సంపద ఉన్నది. 2018 జనాభా లెక్కల ప్రకారం గోజాతి 1,72,506, గేదె జాతి 80,401, గొర్రెలు 2,37 536, మేకలు 2,54,144, కోళ్లు 5,32,946 ఉన్నాయి. జిల్లాలో 34 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, ఐదు ఏరియా పశువైద్య కేంద్రాలు, 58 పశువైద్య ఉపకేంద్రాలున్నాయి. గత నెలలో అన్ని పశువైద్య కేంద్రాల్లో కలిసి 80 వేలకు పై చిలుకు మూ గజీవాలకు వైద్యం అందించారు. ఈ లెక్కన రోజు కనీసం 2500 పైగా చికిత్స అందుతుంది. ప్రస్తుతం సీజన్ కావడంతో గొర్రెలు, మేకలకు గాలికుంటు, నీలినాలుక, దొమ్మ రోగం, మూతి, ఇతర వ్యాధులు సోకుతుంటాయి. దీంతో ప్రతి రోజూ పశు వైద్యశాలలకు చికిత్స నిమిత్తం తీసుకొచ్చే మూగజీవుల సంఖ్య పెరుగుతున్నది. జనవరి వరకు ఇదే పరిస్థితి ఉంటుంది. పశు జాతి వర్షాకాలంలోనే ఎక్కువగా రోగాల బారిన పడుతుంటుంది. ఈ నేపథ్యంలో అవసరమైన మందులను పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడం విడ్డూరం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నది. గత 8 నెలలుగా పశు దవాఖానలకు మందులు సరఫరా నిలిచిపోవడంపై తీవ్ర స్థాయి లో విమర్శలు వస్తున్నాయి. సరఫరా లేక పశువైద్యశాలలన్నింటిలోనూ మందులు నిండుకున్నాయి. కొన్నిచోట్ల బ్యాండేజీలు సైతం బయటి నుంచే తెప్పిస్తున్నారు. ఇదిలావుండగా అత్యవసర మందులైనా కొనుగోలు చేయాలని ఆగస్టు నెలాఖరులో జరిగిన జిల్లా స్థాయి మందుల కొనుగోలు కమిటీ సమావేశంలో నిర్ణయించగా ఇప్పటివరకు ఆ మందులు సైతం పశువుల దవాఖానలకు చేరలేదు.

### ఖాళీగా పోస్టులు ..

జిల్లాలోని పశు వైద్యశాలల్లో పలు పోస్టులు ఖాళీగా ఉండడంతో మూగజీవాలకు వైద్యం అరకొరగా అందుతున్నది. జిల్లాలో ఐదు ఏరియా దవాఖానలుండగా ఐదుగురు అసిస్టెంట్ డైరెక్టర్లు పనిచేస్తున్నారు. 34 పశువైద్యశాలలుండగా వాటిలో 14 మంది రెగ్యులర్ డాక్టర్లు, నలుగురు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండగా.. మిగిలిన 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా 58 పశువైద్య ఉప కేంద్రాలుండగా వాటిలోనూ సగానికి పైగా ఖాళీలే. కులకచర్ల, దోమ, యాలాల, బంట్వారం, పెద్దేముల్, దౌల్తాబాద్, బషీరాబాద్ మండల కేంద్రాల్లోని దవాఖానల్లోనే పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా అక్కడ ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. కాగా ప్రభుత్వం వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు మున్సిపాలిటీల్లో జంతు జనన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటుచేసి వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే వికారాబాద్, పరిగిలో ఈ ఆపరేషన్లు ప్రారంభం కా గా కొడంగల్, తాండూరులలో త్వరలో షురూ కానున్నాయి. ఈ కేంద్రాల్లో ప్రతిరోజూ ఇద్దరు వైద్యులు, ఇద్దరు అసిస్టెంట్లు విధులు నిర్వర్తించేలా అధికారులు డ్యూటీలు కేటాయించారు. అసలే పశువైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతుండగా ఉన్న వారిలోనే ప్రతిరోజూ నాలుగు కేంద్రాల్లో కలిపి 8 మంది వైద్యులు, 8 మంది సహాయకులను నియమించడంతో 8పశువైద్య కేంద్రాల్లో వైద్యం స్తంభించే అవకాశం ఉన్నది.

### సీఎం సొంత జిల్లాలో.. మూగజీవాల రోదన..

రాష్ట్రంలో ఎక్కడ ఎలా ఉన్నా, సీఎం సొంత జిల్లా అంటే అన్నింటిలో ముందుంటుంది. కానీ సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్‌లో మూగజీవాలకు వైద్యం అరకొరగా అందుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పశువైద్య శాఖ ను ముఖ్యమంత్రే చూస్తుండగా జిల్లాలోని పశువైద్యశాలల్లో డాక్టర్లు, సహాయకుల కొరత, 8 నెలలుగా పశువైద్యశాలలకు మందులు అందకపోవడం చూస్తుంటే ఇదే మి పర్యవేక్షణ అని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. మిగతా జిల్లాల్లో ఎలా ఉన్నా సీఎం సొంత జిల్లాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటారు. కానీ వికారాబాద్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నం గా ఉన్నది. ఇప్పటికైనా జిల్లాలో ఖాళీగా ఉన్న పశువైద్యులు, సహాయకుల పోస్టుల ను వెంటనే భర్తీ చేయాలని, మూగజీవాలకు వైద్యం కోసం అవసరమైన మందులు సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

### పాడి రైతులపై ప్రభుత్వం పగ పట్టినట్లు ఉన్నది..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాల బిల్లులు ఏనాడూ సరైన సమయానికి రాలేదు. ప్రతి రోజూ 15 నుంచి 20 లీటర్ల పాటు విజయ డెయిరీకి పోస్తున్నా. రెండు నెలల నుంచి ఒక్క రూపాయి కూడా రాలే. పశువులకు దాణా, పశువుల వైద్య ఖర్చులు ఎక్కడి నుంచి తీసుకురావాలి, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నా.. నా పరిస్థితి ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ప్రస్తుతం లీటరు పాలకు రూ.39 నుంచి రూ.41 వరకు ప్రభుత్వం ఇస్తూ వస్తున్నది. పాల ధరను తగ్గించాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్నది. ఇలా ఇబ్బందులు పెడితే రైతుల ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురికాక తప్పదు.

– గంగిశెట్టి మల్లేశ్, పాడి రైతు, పిట్టలగూడ, నందిగామ



ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆమనగల్లులో పాడి రైతుల ఆందోళన (ఫైల్)

**విజయ డెయిరీ చెల్లించాల్సిన పాల బకాయిలు రూ.14 కోట్లకు పైనే..**

- రంగారెడ్డి జిల్లాలో 350 పాల సేకరణ కేంద్రాలు
- ప్రతిరోజూ డెయిరీకి లక్షా 10వేల లీటర్ల పాల సరఫరా
- మూడు నెలలుగా నిలిచిన బిల్లుల చెల్లింపులు..
- కష్టంగా మారిన నిర్వహణ
- ఆర్థిక ఇబ్బందుల్లో పాడి రైతులు
- కాంగ్రెస్ సర్కారు పట్టించుకోక పోవడంతో మండిపాటు



# అప్పుల పాలు

*ప్రభుత్వ విజయ డెయిరీలో పాలు పోస్తున్నా.. సకాలంలో బిల్లులు రాక జిల్లా రైతులు అప్పల పాలవుతున్నారు. వ్యవసాయ రంగం ఆగమైనా.. పాడి పరిశ్రమ ఆదుకుంటుందన్న నమ్మకంతో ఆ రంగాన్ని ఎంచుకున్న రైతులకు ఆగస్టు 15 నుంచి నిలిచిన బిల్లులతో నిర్వహణ కష్టతరంగా మారింది. బిల్లులు చెల్లించాలంటూ రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు.*

*-రంగారెడ్డి, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ)*

### జిల్లాలో రూ.14 కోట్లకు పైగా బకాయిలు..

కాంగ్రెస్ పాలనలో పాడి రైతులు పరేషాన్ అవుతున్నారు. పదిహేను రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన పాల బిల్లులను సక్రమంగా చెల్లించడం లేదు. నెలల తరబడిగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. జిల్లాలో 350 వరకు పాల సేకరణ కేంద్రాలున్నాయి. ఆరు వేల మంది పాడి రైతులు ప్రతిరోజూ లక్షా 10 వేల లీటర్ల ఆవు పాలను విజయ డెయిరీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. పాల నాణ్యతను బట్టి లీటరుకు కనిష్ఠంగా రూ.40, గరిష్ఠంగా రూ.44 వరకు చెల్లిస్తున్నారు. అయితే ఆగస్టు 15 నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో రూ. 14 కోట్లకు పైగా విజయ డెయిరీ బాకీ పడింది. ఒక్కో రైతుకూ రూ.20 వేల నుంచి రూ.50వేల వరకు పాల బిల్లులను చెల్లించాల్సి ఉన్నది. ఫలితంగా పాడినే నమ్ముకుని జీవిస్తున్న రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు చెల్లించాలంటూ రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా బిల్లులను విడుదల చేయకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. పాల కొనుగోళ్లకు తగ్గట్టుగా విక్రయాలు లేకపోవడం..అధిక ధర చెల్లించి పాలను కొనకపోవడంతోనే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు.

### పశు పోషణకు ఇబ్బందులు..

రైతులకు పశు పోషణ కష్టతరంగా మారింది. మంచి పాల దిగుబడి కోసం జెర్సీ ఆవులను రైతులు ప్రైవేట్‌గా అప్పులు తెచ్చి కొనుగోలు చేస్తున్నారు. పాలను అమ్మ గా వచ్చే ఆదాయంలో సగం పశువుల పోషణకే సరిపోతున్నది. పల్లి చెక్క, మక్క పిండి, తవుడు తదితర వాటిని అందించడంతోపాటు పశువుల చికిత్సకు పెద్ద మొ త్తంలో రైతులకు ఖర్చు అవుతున్నది. ఓ పక్క జెర్సీ ఆవుల మెయింటెనెన్స్ అధికం గా ఉండడం..మరోవైపు తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడం రైతులకు తలకు మించిన భారంగా మారుతున్నది. దీనికితోడు సకాలంలో పాల బిల్లులు రాకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలను చెల్లించి ఆదుకోవాలని జిల్లాలోని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### మార్పు అంటే ఇదేనా..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పాలనలో మార్పు వస్తదన్నరు. మార్పు అంటే మా బతుకులను ఆగం చేయడమేనా ?.. కేసీఆర్ హయాంలో సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి పాల బిల్లులు ఎనుకా ముందు అన్నట్లుగా ఎప్పుడిస్తరో తెలుస్తలేదు. 15 రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన బిల్లులు.. రెండు నెలలు దాటినా ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నలిగిపోతున్నాం. ప్రభుత్వం మీద నమ్మకం పోయి ప్రైవేటు డెయిరీలో పాలు పోస్తున్నా.

–శేఖర్, పాడిరైతు, విఠ్యాల గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం

### ఎలా బతకాలి..



నేను పాడి రైతును. నాకు ఇదే జీవనాధారం. నెలల తరబడి బిల్లులు ఆపితే ఎలా బతకాలి. పశుపోషణతో పాటు కుటుంబం గడువడానికి అప్పులు చేస్తున్నా. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల బిల్లు 15 రోజులు కాగానే వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నెలలు గడుస్తున్నా బిల్లు రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.

– వెంకట్‌నాయక్, పాడిరైతు, విఠ్యాల గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం

### రెండు నెలలుగా..



కడ్తాల్ గ్రామంలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో నిత్యం 130 లీటర్ల పాలు పోస్తా. రెండు నెలలకు రూ.3.50 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉన్నది. బిల్లు రాక ఇబ్బందులు పడుతున్నా. పశు పోషణ కూడా భారమైంది. దాణా, పశువుల మందుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నది. ప్రభుత్వం బిల్లులు చెల్లించాలి.

– జల్కం మహేశ్, పాడి రైతు, కడ్తాల్ మండలం

### పశు పోషణ భారమైంది..



పాల బిల్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నా. రోజూ విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో 80 లీటర్ల వరకు పాలు పోస్తా. రెండు నెలలకు రూ.2.20 లక్షల బిల్లు బకాయి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బిల్లులు సక్కగా వస్తలేవు. ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తున్నది. ఆవులకు దాణా, మందులు కొనలేక పశు పోషణ భారమైంది. కుటుంబం గడువడం కూడా కష్టంగా మారింది.

– బాచిరెడ్డి అశోక్‌రెడ్డి, పాడి రైతు, కడ్తాల్ మండలం

### రూ.2.50 లక్షల బిల్లు రావాలె..



పాడి పరిశ్రమను నమ్ముకున్నందుకు కష్టాలు పడుతున్నా. రోజూ 90 లీటర్ల పాలు పోస్తా. అరవై రోజులకు రూ.2.50 లక్షల బిల్లు రావాలె. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పదిహేను రోజులకోసారి బిల్లు ఇచ్చేటోళ్లు. కాంగ్రెస్ వచ్చినాక కష్టాలు మొదలైనయ్. పశువులను ఎలా పోషించాలి.. పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు ఎలా వెళ్లదీయాలి. ప్రభుత్వం ఆలోచించాలి.

– మంకీ మహేశ్, పాడి రైతు, కడ్తాల్ మండలం



అలుగు పారుతున్న బొంరాస్‌పేట పెద్ద చెరువు

# భారీ వర్షం

పరిగి, సెప్టెంబర్ 24: పరిగి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి అరగంటకు పైగా వర్షం కురియడంతో పరిగి సమీపంలోని వాగు వరద నీటితో ప్రవహించింది. మండలంలోని పలు గ్రామాల్లో సైతం వర్షం కురిసింది. అలాగే రాత్రి 7.30 గంటల నుంచి మళ్లీ వర్షం కురిసింది. వరద నీరు లఖ్నా పూర్ ప్రాజెక్టులోకి చేరింది.

**బొంరాస్‌పేట :** బొంరాస్‌పేట మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఆది, సోమవారాల్లో కూడా మోస్తరు వర్షం కురిసింది. వర్షాలకు పెద్ద చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్నది. వరుసగా మూడో ఏడాది కూడా చెరువు నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద యాసంగిలో వెయ్యి ఎకరాల వరకు ఆయకట్టు సాగవుతుంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి పక్కనే చెరువు ఉండడంతో వాహనదారులు అలుగును చూడడానికి తరలివస్తున్నారు.



వరద నీటితో ప్రవహిస్తున్న వాగు